క్లుప్తంగా

తనిఖీలు



బియ్యం బరువు పరిశీలిస్తున్న లీగల్‌మెట్రాలజీ అధికారి రాజారమేష్

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని పలు దుకాణాలను లీగల్ మెట్రాలజీ అధికారి రాజా రమేష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు అమ్మినా, వస్తువుల బరువులో తేడాలున్నా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సందర్భంగా కొంతమందిపై కేసులు నమోదు చేశారు. ఆయనతో పాటు అసిస్టెంట్ కంట్రోలర్లు మధుసూదనరెడ్డి, రామారావు, ఉమాసుందరి, రాధాకృష్ణ, తదితరులున్నారు.

అనుమతుల్లేని పరిశ్రమలను గుర్తించాలి

● ఎంపీడీఓ రాధిక



పూసపాటిరేగ: అనుమతుల్లేని చిన్న, మధ్యతరహా పరిశ్రమలను గుర్తించాలని ఎంపీడీఓ ఎం. రాధిక అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కిరాణాషాపుల నుంచి చిన్న, మధ్యతరహా పరిశ్రమల వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. అన్ని సచివాలయాల పరిధిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సకాలంలో పరిశ్రమలకు సంబంధించిన నివేదికలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల వినియోగంపై దృష్టి సారించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ పాపినాయుడు

పూసపాటిరేగ: ఎనిమిది, తొమ్మిదో తరగతి విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌ల వినియోగంపై దృష్టి సారించాలని ఎంఈఓ బి. పాపినాయుడు అన్నారు. మండలంలోని తిప్పలవలస జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులు ట్యాబ్‌లను ఎలా వినియోగిస్తున్నదీ, ఆరా తీయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణమూర్తి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. .

లెండి ఇంజినీరింగ్ కళాశాలలో వర్క్‌షాపు

డెంకాడ: జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ మెంటర్‌షిప్‌పై మూడు రోజుల పాటు జరగనున్న వర్క్‌షాపును విజయనగరం జేఎన్‌టీయూ జీవీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ జయసుమ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాంకేతిక విద్యలో అభ్యసనకు, దాని ఫలితాలకు చేయూతనిచ్చేందుకు ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు. అనంతరం జయసుమను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్, జిల్లా సైన్స్ అధికారి ఎం.కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాళ్లు కేవీ నరసింహం, టి.హరిబాబు, విభాగాధిపతులు ఎం.రాజన్‌బాబు, శైలజ, సతీష్, సుబ్బరామయ్య, రామారావు, ప్రసాద్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

నెల్లిమర్ల: పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక కేజీబీవీని ఆయన సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎటువంటి ఆందోళన గురికావద్దని సూచించారు. రాని ప్రశ్నల కోసం ఆలోచిస్తూ సమయం వృథా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి. ఉమ, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వైద్యనాథేశ్వర లింగ ప్రతిష్ఠ

విజయనగరం టౌన్: నగరంలోని రింగురోడ్డులో ఉన్న సాయినాథుని ఆలయంలో ఉమా సహిత వైద్యనాథేశ్వర శివలింగం పునఃప్రతిష్ఠ కార్యక్రమం గురువారం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కరణం జనార్దనరావు దంపతులు హోమం చేపట్టారు. అనంతరం స్వామివారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

జొన్నాడలో అభివృద్ధి జాడ..

● కోట్లాది రూపాయలు వెచ్చించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
● అర్హులందరికీ ఇళ్ల వద్దే ప్రభుత్వ పథకాల అందజేత
● అందుబాటులోనే ప్రభుత్వ కార్యాలయాలు
● మౌలిక సదుపాయాల కల్పనతో ప్రజల్లో వెల్లివిరుస్తున్న ఆనందం





జొన్నాడలో నిర్మించిన రైతుభరోసా కేంద్రం



జొన్నాడ - అక్కివరం తారురోడ్డు మరమ్మతుల శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు (ఫైల్)

డెంకాడ:

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తోంది. పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. స్వాతంత్య్రం వచ్చిన ఇన్నాళ్లకు గ్రామాలు అభివృద్ధి బాట పడుతుండడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని జొన్నాడ పంచాయతీ జొన్నాడ సచివాలయం పరిధిలో జొన్నాడ, ఆకులపేట, దువ్వపేట, మన్యాలపేట, గొలగానిపేట గ్రామాలున్నాయి. వీటి పరిధిలోని ప్రజలకు కోట్లాది రూపాయిలు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేశారు. గతంలో జరగని అభివృద్ధి పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరుగుతుండడంతో జొన్నాడ గ్రామం ప్రగతిపథంలో నడుస్తోంది.

పంచాయతీలో జరిగిన అభివృద్ధి..

● రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనం నిర్మించారు.
● రైతులకు సేవలందించేందుకు రూ. 20 లక్షల వ్యయంతో రైతుభరోసా కేంద్రం నిర్మించారు.
● నాడు–నేడు ద్వారా రూ. 78 లక్షలతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు.
● పంచాయతీ, మండల పరిషత్, తదితర నిధులతో జొన్నాడ గ్రామంలో రూ. 25 లక్షల వ్యయంతో సీసీ కాలువలు, రోడ్లు, కవర్ శ్లాబ్‌లు నిర్మించారు.
● తాగునీటి సౌకర్యం కోసం రూ. 10 లక్షలు, సుజల స్రవంతి ద్వారా ట్యాంకుల నిర్మాణం, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు.
● దువ్వపేట గ్రామంలో రూ. 10 లక్షల వ్యయంతో కాలువ నిర్మించారు.
● మన్యాలపేట గ్రామానికి రూ. 5లక్షల వ్యయంతో తాగునీటి పైపులైన్ సౌకర్యం కల్పించారు.
● గొలగానిపేట గ్రామంలో రూ. 5 లక్షలతో కాలువలను నిర్మించారు.
● ఆకులపేటలో రూ. 2.5 లక్షలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి..

జగనన్న అమ్మఒడి	: రూ. 1,99,48,155
జగనన్న విద్యా దీవెన	: రూ. 66,68,842
వైఎస్సార్ రైతుభరోసా	: రూ.2,09,81,000
వైఎస్సార్ పెన్షన్ కానుక	: రూ. 5,55,57,000

వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నావడ్డీ, వైఎస్సార్ బీమా, వాహనమిత్ర, జగనన్న చేదోడు, తదితర సంక్షేమ కార్యక్రమాల ద్వారా కలిగిన లబ్ధి : రూ. 17,28,60,485
జగనన్న కాలనీలు, విద్యాకానుక, విద్యార్థులకు బైజూస్, సంపూర్ణ పోషణ, బియ్యం కార్డులు, తదితర నాన్ డీబీటీ పథకాల ద్వారా కలిగిన లబ్ధి: రూ. 5,28,27,547



జొన్నాడలోని విశ్వబ్రాహ్మణ వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు



ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందిస్తున్న వలంటీర్లు, తదితరులు (ఫైల్)



జొన్నాడ గ్రామ సచివాలయ భవనం

జగనన్న పాలనతో ప్రజలకు మేలు..



పేద ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు చేస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తున్నారు. సచివాలయ వ్యవస్థ, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు చేసి పాలనలో విప్లవాత్మకమైన పాలనకు తెర తీశారు. వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల ఇంటి వద్దే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారు. గ్రామంలో కోట్లాది రూపాయల వ్యయంతో ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణం, సీసీ రోడ్లు, కాలువలు, తాగునీటి ట్యాంకులు, ఇంటింటి కుళాయిలు, తదితర మౌలిక సౌకర్యాలు కల్పించారు. జొన్నాడ నుంచి అక్కివరం వరకు రూ. 4 కోట్లతో తారురోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నారు.

–కోరాడ రమణి, సర్పంచ్,జొన్నాడ.

ఇంటికే పింఛన్ తెచ్చి ఇస్తున్నారు..



జగన్‌బాబు ముఖ్యమంత్రి అయ్యాక వలంటీరు ఇంటికి వచ్చి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయానికే పింఛన్ వస్తోంది. గతంలో రోజుల తరబడి పంచాయతీ కార్యాలయం వద్ద వేచి ఉండాల్సి వచ్చేది. అలాగే రేషన్ సరుకులు కూడా ఇంటి వద్దనే తీసుకుంటున్నాం. మాలాంటి వృద్ధులకు ఇబ్బందుల్లేకుండా పాలన సాగిస్తున్న జగన్‌బాబు మరోసారి ముఖ్యమంత్రి కావాలి.

– సంఘం పైడినాయుడు, జొన్నాడ గ్రామం

ఇల్లు నిర్మించుకున్నాను..



మాకు జగనన్న కాలనీలో భాగంగా ప్రభుత్వం ఇంటి పట్టాను మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేయడంతో సొంతింటి కల నెరవేరింది. మా అబ్బాయికి ఆటో ఉండడంతో వాహనమిత్ర ద్వారా ఆర్థిక సాయం అందుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్ల మా కుటుంబానికి అనేక విధాలుగా మేలు జరిగింది.

– దువ్వు నరసమ్మ, దువ్వపేట గ్రామం

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
● 39వ డివిజన్‌లో రూ.15 లక్షలతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



బీటీ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, మేయర్ విజయలక్ష్మి, తదితరులు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 57 నెలల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. నగరంలోని 39వ డివిజన్ పరిధిలో గల అలకానంద కాలనీలో రూ.15 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేయనున్న బీటీ రహదారికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానికులు కోలగట్లకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగరాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారని చెప్పారు. నగరాన్ని అభివృద్ధి చేసినందుకుగాను కోలగట్లను అభినందించాల్సి పోయి.. ప్రతిపక్షాలు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ప్రతి డివిజన్‌లో ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా ఆయన చేస్తున్న కృషి మరువరానిదన్నారు. స్థానిక కార్పొరేటర్ వింత ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ. 15 లక్షలతో బీటీ రహదారి ఏర్పాటు చేయడంతో పాటు కల్వర్టు కూడా నిర్మించడం సంతోషించదగ్గ విషయమన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి జరగాలంటే వీరభద్రస్వామి లాంటి వ్యక్తులను గెలిపించుకోవాల్సిన అవసరం ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ వి.విజయలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల తమన్నశెట్టి , డిప్యూటీ మేయర్ లయాయాదవ్, కార్పొరేటర్ పిన్నింటి కళావతి పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేస్తున్న కాంతారావు, తదితరులు

విజయనగరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సహాయ, సహకారాలు అందించడం ద్వారా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కేఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు యాదవ్ అన్నారు. నగరంలోని కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అవసరమయ్యే పరీక్ష సామగ్రిని ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో తీసుకువచ్చిన సంస్కరణలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మార్పు చేయటం దేశంలోనే గొప్ప చరిత్రగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ముద్దాడ మధు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కాంచన, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు జానకీరామ్, నవీన్, అనిల్, సీరనాయుడు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం రేపు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్కెట్ ఆశీలు వసూలుకు ఈ నెల 2వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్లు కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించనున్న వేలంలో ఆసక్తిగల వారు పాల్గొనాలని కోరారు

5న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

విజయనగరం రూరల్: ఈ నెల 5న జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు 1 నుంచి 7 వరకు స్థాయీ సంఘాల సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు



రాజబంగారమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు



అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

నెల్లిమర్ల: రాజబంగారమ్మ ఆశీస్సులు ప్రజలందరిపైన ఉండాలని ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆకాంక్షించారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో గ్రామదేవత రాజబంగారమ్మ ఆలయ పునఃప్రారంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రత్యేక పూజలు చేశారు. యూత్‌వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ పాల్గొని రూ.20 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, పాండ్రంకి సత్యనారాయణ, అవనాపు విజయ్‌భాస్కరరావు, సముద్రపు వెంకటరమణ, సముద్రపు సత్తిబాబు, మద్దిల రాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

భోగాపురం: మండలంలోని రావాడ కూడలి వద్ద పోలీసులు గురువారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో రావాడ గ్రామానికి చెందిన బుత్తల ఉగాది నుంచి 16 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

90 మద్యం సీసాలు..

విజయనగరం క్రైమ్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం దాడులు చేపట్టారు. ఎస్ఈబీ ఇంటిలిజెన్స్ వింగ్ నేతృత్వంలో నెల్లిమర్ల మొయిద జంక్షన్‌లో తనిఖీలు చేపట్టగా పతివాడ వెంకట మురళీ అనే వ్యక్తి నుంచి 90 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ టీవీ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయండి



వైవీ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈశ్వర్ కౌశిక్, కోలగట్ల శ్రావణి

విజయనగరం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్‌గా ఎన్నికైన వైవీ సుబ్బారెడ్డిని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, మన్యాల కృష్ణ, ఇప్పిలి శ్రీనివాసరావు, కిలాన శ్రీనుయాదవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖలో ఆయన్ను కలిసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సత్యా విద్యాసంస్థలు గురువారం నిర్వహించిన రక్తదానం శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ప్రారంభించారు. సీతం ఇంజినీరింగ్ కళాశాల, సత్య డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రామమూర్తి, వైస్ ప్రిన్సిపాళ్లు టీడీవీఏ నాయుడు, సీహెచ్.వెంకటలక్ష్మి, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

పశువులను రవాణా చేస్తే కఠిన చర్యలు

● ఆర్డీఓ సూర్యకళ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌డీఓ సూర్యకళ, తదితరులు

విజయనగరం అర్బన్: అనుమతులు, ఎన్‌ఓసీలు లేకుండా పశువులను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని విజయనగరం ఆర్డీఓ ఎం.వి సూర్యకళ అన్నారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అధికారులు, జంతు సంక్షేమ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి మండల స్థాయిలో ఎస్‌హెచ్‌ఓ, తహసీల్దార్, ఎంపీడీఓ పరిధిలో ఉన్న కమిటీలను పటిష్ఠపరుస్తామన్నారు. అనంతరం జంతుసంక్షేమ కమిటీ రూపొందించిన క్యాలెండర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ డీడీ డాక్టర్ వైవీ రమణ, ఆర్‌డీఓ కార్యాలయ సూరింటెండెంట్ హరికిరణ్, రూరల్ సీఐ ముదిలి శ్రీనివాసరావు, డివిజనల్ జంతు సంక్షేమ కమిటీ బోర్డు డైరెక్టర్స్ రాజకుమారి, సత్యనారాయణ, పి.సంతోష్ కుమార్, దేవి, ఏపీ గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పైడితల్లిని దర్శించుకున్న ఆర్‌జేసీ



విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారిని దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎం. విజయరాజు (రాజమండ్రి) గురువారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వేదపండితులు పూర్ణకుంభంతో ఆయనుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ అమ్మవారి చిత్రపటాన్ని ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌జేసీ విజయరాజుకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ

విజయమే లక్ష్యం

● ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చెల్లూరులో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు అధ్యక్షతన కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికీ రాజకీయాలకతీతంగా పథకాలు అందాయన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రజలకు ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలను జన్మభూమి కమిటీల రూపంలో టీడీపీ నేతల జేబుల్లోకే వెళ్లిపోయాయని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలు, రైతులు, పేదలు, విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. అలాగే గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల గడప వద్దనే ప్రభుత్వ సేవలు, సంక్షేమం ఫలాలు అందుతున్నాయని చెప్పారు. దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా వైద్య, విద్యా రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామిని, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బడుకొండ సర్పంచ్ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు బోద అప్పలకృష్ణ, బొంతు పైడినాయుడు, రవికుమార్, గొల్లలపేట ఎంపీటీసీ సభ్యుడు రమణ, మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.